క్లుప్తంగా

పండ్ల ధరలకు రెక్కలు



కందుకూరులో పండ్ల దుకాణాలు

కందుకూరు: మహా శివరాత్రిని పురస్కరించుకుని పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. శివ రాత్రి సాయంత్రం భక్తులు ఉపవాస దీక్ష అనంతరం పండ్లు ఆహారంగా తీసుకుంటారు. దీంతో చిరు వ్యాపారులు పండ్ల రేటును అమాంతం పెంచేశారు. నిన్నటి వరకు అరటి డజను రూ.50 నుంచి రూ.60 వరకు ఉండగా, రూ.80కు పెంచారు. ఇలా అన్ని పండ్ల ధరలు పెంచి అమ్మకాలు సాగించారు. అయినా తప్పనిసరై భక్తులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సైతం పండ్ల దుకాణాలు విరివిగా వెలిసి పండ్ల విక్రయాలు బాగా జరిగాయి.

సీఎం సహాయనిధి చెక్ అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌కు చెందిన ముత్యాల సుదర్శన్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని మంత్రి సబితారెడ్డి దృష్టికి బీఆర్ఎస్ నాయకులు తీసుకెళ్లగా.. స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.లక్ష ఎల్‌ఓసీని శస్త్రచికిత్స నిమిత్తం మంజూరు చేయించారు. ఈ చెక్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, క్లోం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, జూకంటి సురేష్‌గౌడ్, సోషల్‌మీడియా కన్వీనర్ సాంబశివ బాధిత కుటుంబానికి అందచేశారు. ఆపదలో ఉన్నవారు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

వ్యక్తి దుర్మరణం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామం వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆమనగల్లు ఎస్‌ఐ సుందరయ్య కథనం ప్రకారం వివరాలు.. హైదరాబాద్ నగరం వినయ్‌నగర్ కాలనీకి చెందిన మాణిక్‌రెడ్డి(60) శుక్రవారం ఉదయం బైక్‌పై నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి వస్తుండగా విఠాయిపల్లి గ్రామ సమీపంలో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు అభిజిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మాణిక్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కొనసాగుతున్న నవ చండీయాగం



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ తదితరులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్-2లోని రేణుక రాజేశ్వరి పీఠం జగన్మాత ఆలయంలో మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్ర సహిత నవ చండీయాగం రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. యాగంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్తనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రదీప్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలేశ్వరుని గుట్టపై బోరు పనులు ప్రారంభం

యాచారం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం యాచారం మండల కేంద్రంలోని శ్రీ తిరుమలనాథ దేవాలయం (తిరుమలేశునిగుట్ట)పై చింతపట్ల ఎంపీటీసీ సభ్యురాలు (బీజేపీ) తాండ్ర లక్ష్మమ్మ రూ.లక్ష సొంత డబ్బుతో బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, యాచారం సర్పంచ్ ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లలిత, దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు ఈవీఎస్‌రెడ్డి, సత్తమ్మ, వెంకట్‌రెడ్డి, వార్డుసభ్యులు జయమ్మ, సంజీవ, వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు. తాండ్రలక్ష్మమ్మను ఘనంగా సత్కరించారు.



మహేశ్వరం: శివగంగ ఆలయంలో.. బీజేపీ నాయకుడు అందెల శ్రీరాములు యాదవ్



తుక్కుగూడ: ఓంకారేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హరహర శంభో శంకర

భక్తులతో కిటకిటలాడి శైవక్షేత్రాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు దేవాలయాలకు తరలివచ్చి.. శివున్ని దర్శించుకొని పులకరించిపోయారు. ఉపవాసంలో ఉన్న భక్తులు భక్తిశ్రద్ధలతో దీక్షవిరమణ చేసి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా జాగరణ చేసేందుకు నిర్వాహకులు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



మీర్‌పేట కూడలి కాశీనర్మదేశ్వర స్వామి ఆలయంలో..



మహేశ్వరం: శివగంగ ఆలయంలో బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు

పండగ పూట పారిశుద్ధ్యం పట్టదా?



వాదే ముస్తఫా బస్తీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త

- చెప్పినా పట్టించుకోని మున్సిపల్ కమిషనర్
- మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ ఆరోపణ

పహాడీషరీఫ్: ముస్లింల పవిత్రమైన షబ్-ఏ-మేరాజ్ పండగ పూట స్థానికంగా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ ప్రశ్నించారు. రాత్రి పూట జరుపుకొనే ఉత్సవం సందర్భంగా వాదే ముస్తఫా బస్తీలోని మజీద్‌లు, రోడ్ల వెంట పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వసంతకు మూడు రోజుల ముందు నుంచే విన్నవించామని హుస్సేన్ తెలిపారు. అయినప్పటికీ కమిషనర్ ముస్లిం బస్తీలపై చిన్న చూపు చూస్తూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలు పట్టించుకోకపోవడంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

భాష్యం జెడ్‌ఈఓ అంకమ్మరావు

మీర్‌పేట: విద్యార్థులు ఇష్టపడి చదవాలని భాష్యం పాఠశాల జెడ్‌ఈఓ అంకమ్మరావు సూచించారు. మీర్‌పేటలోని భాష్యం పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రధానోపాధ్యాయులు స్రవంతి మాట్లాడుతూ ప్రతి విషయాన్ని సూక్ష్మ పరిశీలనా దృష్టితో చదివితే ఉన్నత ప్రమాణాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ శృతి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఖాయం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు: రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్తగూడ గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ సమావేశంలో పార్టీ దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కేసీఆర్ నెరవేర్చలేదని విమర్శించారు. దళితులను మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. దేశానికి దళితులను రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీదేనన్నారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ మమత, నాయకులు మహేందర్, నర్సింహారెడ్డి, పాండు, నిమ్మ అంజిరెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

వీరాంజనేయుడి ఆలయంలో ఘనంగా పూజలు

పాల్గొన్న మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, గణపతి పూజ, పుష్పాలంకరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేసిన భక్తులు.. ఆలయంలో శివపార్వతులను దర్శించుకొని దీక్ష విరమించారు. మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు, మంత్రి తనయుడు కౌశిక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, ఘట్టుపల్లి సర్పంచి అనితారెడ్డి, ఆలయ ట్రస్టీలు ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాకేష్‌రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, పీఏసీఎస్ చైర్మన్ పాండు, బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీనివాస్, సామెల్ రాజ్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, ఆలయ సిబ్బంది వీరేశం తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి సబితారెడ్డి

ఘనంగా పరమహంస జయంతి



రామకృష్ణ పరమహంస జయంతిలో సభ్యులు

తుక్కుగూడ: రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలను మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో శనివారం రామకృష్ణ పరమహంస సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని పది మంది నిరుపేదలకు రూ.5 వేల ఆర్థిక సహాయం, బస్తా బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బి.యాదగిరిరెడ్డి, సొసైటీ సభ్యులు లింగం వికాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి

వనస్థలిపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కూడా నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. శుక్రవారం రాత్రి వనస్థలిపురంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత సీఎం, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉద్యోగాల భర్తీ తదితర హామీలను కేసీఆర్ నెరవేర్చలేకపోయారని ధ్వజమెత్తారు. కేసీఆర్, మంత్రి కేటీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం ప్రగతిపథంలో పయనిస్తోందని అన్నారు. త్వరలో తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు రాబోతుందని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, కార్యదర్శి క్రాంతిగౌడ్, నాయకులు విజయ్‌కుమార్, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి

రూ.13 కోట్లతో వీరన్నగుట్ట అభివృద్ధి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఇచ్చిన హామీ మేరకు వీరన్న గుట్టను రూ.13 కోట్లతో అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ వీరన్నగుట్టను శనివారం కాలనీవాసులతో కలిసి సందర్శించారు. వీరన్నగుట్ట చుట్టూ రూ. 1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... వీరన్నగుట్ట అభివృద్ధిలో కాలనీల ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీకి తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. రాబోయే రెండేళ్లలో గుట్ట పరిసర ప్రాంతాలను సుందరీకరించి ఆహ్లాదంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గుట్ట అభివృద్ధికి హెచ్‌ఎండీఏ నుంచి రూ. 13 కోట్లు మంజూరు చేయించామని అంటూ తాను హామీ ఇస్తే ఒకరోజు అటో ఇటో వంద శాతం ఆ హామీని నెరవేరుస్తానని దేవిరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, ధనలక్ష్మి, జగదీశ్‌యాదవ్, నరహరిశెట్టి, కె.కె.ఎల్.గౌడ్, కడమంచి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మార్కండేయ ఆలయానికి వంటసామగ్రి బహూకరణ



వంటసామగ్రి అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి రూ.1.5 లక్షల విలువైన వంటసామగ్రిని బహూకరించారు. దేవాలయంలో గోలి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వంటసామగ్రిని అందించారు. శ్రీనివాస్‌రెడ్డి దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాలకృష్ణయ్య, కార్యదర్శి శివలింగం, కోశాధికారి సత్యరాములు, యువజన సంఘం అధ్యక్షుడు మామిడిశెట్టి రవి, మహిళా సంఘం అధ్యక్షురాలు అప్పం అలివేలు, నాయకులు చెర్కు రవి, శ్రీను, నర్సింహ, జగదీశ్వర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం క్షేత్రంలోని శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను శనివారం రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోన శ్రీనునాయక్, మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎంపీటీసీ సరిత పంతునాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22 నుంచి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

కడ్తాల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 22 నుంచి 28 వరకు మేకలు, గొర్రెల్లో నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి భానునాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 22న ముద్విన్, చల్లంపల్లి, కడ్తాల్‌లో నులిపురుగు నివారణ కార్యక్రమం ప్రారంభమవుతుందని.. జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళాకారులను ప్రోత్సహిస్తాం

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: కనుమరుగవుతున్న ప్రాచీన కళలను, కళాకారులను ప్రోత్సహిస్తామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో త్వరలో యాదవులు భ్రమరాంబ మల్లికార్జునస్వామి నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ మేరకు వారు నాటకానికి ఆర్థికసహాయం అందజేయాలని ఇటీవల ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డిని కలిసి కోరారు. వారి విజ్ఞప్తి మేరకు రాఘవేందర్‌రెడ్డి శనివారం మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి దేవాలయంలో కళాకారులకు రూ.35,000 అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ స్వప్నా భాస్కర్‌రెడ్డి, పాండయ్య, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 23, వంకాయ 23, బెండ 55, పచ్చి మిర్చి 40, కాకర 35, బీర 45, క్యాబేజి 9, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 15, దొండ 23–28, చిక్కుడు 40, గోకర 45, బీట్‌రూట్ 16, క్యాప్సికం 47, ఆలు 18, దోస 28, సొర 13, పొట్ల 18, ఉల్లి 16, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆమనగల్లులో శివాజీ శోభాయాత్ర

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో శనివారం సాయంత్రం శివాజీ పరివార్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలో శోభాయాత్ర, కాగడాల ప్రదర్శన నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి పట్టణంలోని అన్ని కాలనీల్లో శోభాయాత్ర, కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, శివాజీ పరివార్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిరంజన్, ఆర్ఎస్ఎస్ విభాగ్ సహప్రముఖ్ శివాజీ, శివాజీ పరివార్ సభ్యులు పాల్గొన్నారు.



కాగడాల ప్రదర్శనలో శివాజీ అభిమానులు